# అరుదైన ఆణిముత్యాలు

డా॥ ఇరగవరపు రంగాచార్యులు

ఊరికి చివర పూరి గుడిశ. శ్రమ జీవుల కష్టానికి విలువ ఎలా కట్టలేమో, వారి ఆదర్శానికి ఇంతా అని చెప్పలేము. శీలమే ప్రధానమనుకొనే ఈ పవిత్ర భారతావనిపై వన్నెతెచ్చే మనుష్యులకు కులగోత్రాలతో పనేమిటి వారి ఆశయమెప్పుడూ త్యాగాన్నే కోరుతుంది.

పేరుకే సిరిపురం. కాని, భోగభాగ్యాలకు నిత్యమూ అలమటింపే.

ఆ పూరి గుడిశలో నుల కుక్కిపై బల్లిలా అంటి పెట్టుకొని, తన ఇల్లాలు మల్లి కోసం కళ్లలో ఒత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్న నాగులు దీన స్థితి చూస్తే కడుపు తరుక్కుపోతుంది. పక్షవాతాన పడి కుడి చెయ్యి, కాలు పడిపోయాయి. ఎజమానిగా భూషయ్య తోచిన వైద్యం వేయించి ఊరుకొన్నాడు. కాని, నాగులు లేచి తిరగలేదు. ఎవరన్నా లేవదిసి కూర్చోబెడితే కూర్చుంటాడు.

రాత్రి తొమ్మిది దాటింది. కీచురాళ్ల అరుపులు చెవులను చిల్లులు పడేస్తుంటే, వానపాము నోట పడ్డ కప్ప హీన స్వరం హృదయాన్ని ద్రవింప జేస్తుంది. విధి చేతలకు ఉన్నవాడు లేనివాడనే తారతమ్యాలుండవు. ఎంతటివారైనా తల వంచక తప్పదు.

నాగులు పోషణా భారమంతా మల్లి మీద పడింది. నాలుగిళ్లలో పని చేసుకొని, పది పదకొండు గంటలకు ఊడ్పులకో, కోతలకో వెళ్లి సంపాదించటం నిత్యకృత్యం. ఎంత కష్టపడ్డా ఆమె సంపాదనంతా నాగుల రోగానికే సరిపోతుంది. మల్లి మంచితనం వల్ల ఆ నాలుగిళ్లలోను ఆమె తిండి, టిఫిన్‌లు పోగా నాగులుకు ఇన్ని మెతుకులు పెట్టేవారు. అదిగాక వాళ్లిచ్చే పాత చీరెలు, రెవికలతో కాలం వెళ్లబుచ్చుతూండేది. మల్లి నలుపైనా గుణం నలుపు కాదు. చూడటానికి గుండ్రనైన ముఖం, సోగ కళ్లు బొద్దుగా ఉండి అందరి చేత ఆకర్షింపబడేది. కొంటిగాళ్ల చూపులకు లొంగకుండా గుట్టుగా కాపురం చేసుకొంటూ నలుగురిలో "మల్లిలాంటి మనిషి లేదురా...! మచ్చ లేని ముత్యం..." అనిపించుకొనేది.

డాక్టర్ రఘురామ్ ఆ ఊరికి పెద్ద డాక్టరు. పుట్టింది అక్కడే. పేదసాదలంటి ఎనలేని అభిమానం. ఇచ్చినా, ఇవ్వకపోయినా, చివరికి లేనివాడంటి తన డబ్బు ఖర్చు చేసైనా వైద్యం చేసి ఊరంతలో పేరు తెచ్చుకొన్నాడు.

చాలా రాత్రైందేమో మల్లి ఆదరాబాదరా అంటూ ఇంటికి చేరి ఓరగా ఉన్న తడికె నెట్టుకొని లోపలకు అడుగుపెట్టింది. మల్లిని చూడగానే నాగులు "వచ్చావా మల్లీ...?" అంటూ నీరసంగా పలకరించాడు.

అతని స్థితికి కరిగిపోయిన మల్లికి చాలా సేపు నోటంట మాట రాలేదు. కట్టలు తెంచుకొచ్చే దుఃఖాన్ని దిగమింగుతూ దగ్గరగా చేరి "నీరసంగా ఉందా మావా..?" అన్నప్పుడు ఎంతో జాలి ఉట్టిపడుతూంది. కళ్ల వెంట కారే నీటి బిందువులను కొంగుతో ఒత్తుకొనటం చూచిన నాగులు ఎడం చేత్తో ఆమె కన్నీళ్లు తుడుస్తూ "బాధపడుతున్నావా? ఎంత కాలం నిన్ను కష్టపెట్టాలో తెలియటం లేదే..?" అంటూ పెద్దగా నిట్టూర్చాడు.

అవేం మాటలు మావా...? కష్టపడే వోళ్లకు ఇది కష్టమెలా ఔతది...? నీకొచ్చింది కాబట్టి అనుకొంటున్నావ్...! నీకు సేవ చేయకపోతే నేను బ్రతికుండి ఏం లాభం మావా...? నీకీ విధంగా వచ్చినందుకు బాధపడుతున్నాగాని మరో అందుకు కాదు..."

"మల్లీ అదృష్టం కొద్దీ దొరికావే... ఈ బాధలు నేను పడలేక నాతో బాటు నిన్ను పెట్టలేక తొందరగా పోవాలని కోరుకొంటున్నా...!"

"మావా...? ఏంటా మాటలు...? నేను కాలెట్టాకే ఈ మాయదారి రోగం నిన్ను పట్టిందని నలుగురూ నన్నంటుంటే బాధపడ్డాగాని..." అంటుంటే ఆమె కళ్లు జలపూరితాలయ్యాయి. కొద్దిసేపటికి తమాయించుకొని "సరేలే మావా...! చాలా రేత్రైంది ముద్ద తిను మావా...!" అంటూ తెచ్చిన అన్నం కలిపి నోటికందించింది.

"నువ్వు తిన్నావటే...?"

"ఆ మావా...!"

"నేను నమ్మను...! నా పొట్ట నింపటానికి నీ డొక్క మాడుస్తున్నావు...! అది న్యాయం కాదే..." అంటూ బాధతో విలవిలలాడిపోయాడు.

"అబద్ధం ఇంత వరకూ ఆడలేదు మావా.... బ్రతికుండగా ఆడను కూడా...!నలుగు రమ్మలూ అభిమానించి నాకూ పెడుతున్నారు. నీకూ పెడుతున్నారు...! టిఫిన్ ఇస్తారు. చినిగిన చీరెలు, రెవికెలు ఇత్తారు...! ఆళ్లే లేకపోతే మనమిపాటికి చచ్చి ఉండవలసిందే...!"

"నిజమేనే మల్లి...! ఆళ్లే అభిమానించకపోతే నువ్వన్నదే సత్తెం...! నువ్వు తింటున్నావో లేదో అనే బాధకొద్దీ అనేసా...!" అంటూ నోరు తెరిచాడు.


వారిద్దరి మధ్యా అభిమానం, అనురాగాలు ఎలా పెనవేసుకుపోయాయో చెప్పటం చాలా కష్టం. విడివడని అనుబంధం ముడిపడిపోయిందీ.

తినటం పూర్తయ్యాక మంచి నీళ్లు త్రాగించి మెల్లగా పడుకోబెట్టింది. ఊరంతా సద్దు మణిగింది.

"చీకటుండగా లేస్తేగాని ఇంటి పనులు పూర్తి చేసుకొని, మల్లీ పనిలోకి పోవాలి..." అనుకొంటూ మూలనున్న చింకి చాప మంచం పక్కనే పరచి నడుం వాల్చింది.

పది క్షణాల తర్వాత "మల్లీ నేనొకటి అడుగనా...?" అంటూ ఆత్రంగా ఆమె సమాధానానికై ఎదురు చూస్తున్నాడు.

"నాకాడుంటి నీకెప్పుడూ అడ్డు లేదు .. అడుగు..."



"అడిగాక ఇధైపోతావేమో..?"

"ఇధైపోయే ఇషయమైతే అడగకు...!"

ఆ సమాధానంతో అడగాలనుకొన్నది కూడా అడగలేదు. ఆడదాని సంపాదన మీద బ్రతకటమంటి సరైన మగవానికి బాధగానే ఉంటుంది. పదిమందిలో మగవాడనిపించుకోవాలని తాపత్రయపడటం మగత్వానికి వీర లక్షణం. కొందరిలో అది లోపించి కట్టుకొన్న ఇల్లాలిని అది తేలేదు, ఇది తేలేదని రాసి రంపాన పెడతారు. అటువంటి మగరాయళ్ళు పుట్టింది మానవ జాతైనా మృగం కన్నా హీనమనే అనాలి.

కొంతసేపైన తర్వాత నాగులు మెల్లగా ఒత్తిగిలి "మల్లీ.... నిద్రోతున్నావా...?'" అనగానే "లేదు...! ఏం కావాలి...?" అంటూ దగ్గరకు చేరింది.

ఆమె బుగ్గ మీద ఆప్యాయంగా నిమిరాడు. రెండు కళ్ళు చాలవన్నట్లుగా ముఖాన్నంతనీ కలయజూచి తృప్తి పడ్డాడు. కానీ, ఆ తృప్తి అట్టే కాలం నిలువలేదు. "ఈ అందం అడవిలోని మల్లెపూవులా వృధా అయిపోతుందే" అన్న బాధ కలగగానే "మల్లీ.. నా కోరిక తీరుస్తావా..?" అన్నాడు.. భావమేమో అర్థం కాక ముందు గాబరాపడ్డది.

బిత్తర చూపులతో "నీకు...?" అంటూ ప్రశ్నార్థకంగా చూస్తూ ఉండిపోయింది.

"కంగారడకే...! ఈ స్థితిలో నేనేదో కోరుతున్నాననుకోకు...!"

"మరి...?"

"మరో ఇదంగా అనుకోకపోతే నీ సుఖాన్ని పాడు చేసుకోవటం కన్నా...!"

"కన్నా...?"

"మరో మనువాడి సుఖంగా ఉండమంటున్నానే...!"

ఆ మాట వినగానే "మావా...!" అనే పెనుకేకతో ఆ నిశ్శబ్ద వాతావరణం చెల్లా చెదురైపోయింది. పెద్దగా ఏడుస్తూ నాగులు గుండెల మీదకు వాలి-పోయింది... నాగులు ఆమె తల నిమురుతూ "తప్పుగా అన్నానా...?" అనగానే-

చివాలున లేచి "నా సుఖం కోసం ఎప్పుడైనా ఇదిగా ప్రవర్తించానా...? సుఖం లేదని నీతో చెప్పానా...? కట్టుకొన్న వాడు పుట్టెడు రోగంతో బాధపడుతూంటి, సుఖం కోరే ఆడది మనిషి కాదుమావా...! నాకటువంటి సుఖం వద్దు... సుఖమే ముఖ్యమనుకొనే ఆడదుంటి మా జాతికి అంతకన్నా అవమానం మరొకటుండదు...! ఆడదానికి మానమే ప్రాణమన్నారు...! అటువంటి పరిస్థితే వస్తే నీ మల్లి నీకంటే ముందే చస్తుందని తెల్సుకో...!" అంటూ తన నిర్ణయాన్ని ఖండించి చెప్పేసింది. పౌరుషమైన స్త్రీ జాతి లక్షణమది... వెక్కి వెక్కి ఏడుస్తుంటే "పోల్నేయే...! మనసులో దాచుకోలేక అన్నాను...! తప్పైతే క్షమించు...! కాని, ఒక్క విషయం...! నేనెలాగూ బ్రతకను...! ఇక్కడంటి



ఈ ఛాకిరి వాళ్ళు నిన్ను బ్రతకనివ్వరు...! నీ పుట్టింటికెళ్ళిపో..." అంటూ ఆమెను సమాధాన పరచటానికి ప్రయత్నించాడు. కాని, ఆమె ఎటూ చెప్పలేదు. అతని పక్కనే ఒదిగి ఘుత్తులోకి ఒదిగిపోయింది.

*　　　*　　　*

పరుగులు తీసే కాలంతో పోటీ పడలేం కాని ఎథాశక్తి వెంట పడాలిగా ఈ మానవ లోకం.

కాకులు కూతలే మేలుకొలుపు ఆ పేద జీవులకు. మల్లి కళ్ళు తెరిచేసరికి ముసి ముసి చీకటుంది. లేచి కూర్చొని నాగులు ముఖంలోకి వంగి చూచింది. మెలకువలో లేడు.

"ఎంత అమాయకుడివి మావా..!" అనుకొంటూ తాళిబొట్టును కళ్ళకద్దుకొని, వీధి వాకిలి చిమ్మటానికి లేచి వెళ్ళింది. వాకిలి చిమ్మి, నీళ్ళు జల్లి ముగ్గు పెట్టి కాలకృత్యాలు తీర్చుకొనేసరికి తెల్లవారింది. నాగులును లేపి ముఖం కడిగించి కూర్చోబెట్టి, కుండ పుచ్చుకొని నీరు తేవటానికి చెరువుకు బయలుదేరింది.

అవకాశం కోసం ఎదురు చూసే గుంట నక్కలు కాచుకొనే ఉంటాయి. పెద కాపు భూషయ్య కొడుకు సినయ్య మల్లి కోసం వల వేస్తూనే ఉన్నాడుగాని చిక్కటం లేదు. ఎవరి కంటైతే పడకూడదనుకొన్నదో ఆ రోజు చెరువు గట్టు మీద సినయ్య పల్లు తోముకొంటూ కనిపించగానే "పొద్దుటే వీడి కళ్ళ పడ్డానేమా...?" యని మనసులో వాపోయింది. అలాగే రేవులోకి దిగి నీళ్ళు ముంచబోతుండగా-

"ఏ మల్లి...! నీళ్ళట్రాయే...!" అంటూ గట్టిగా రంకె వేసాడు.

ఆ రంకెకు మల్లికి ఒళ్ళు మండిపోయింది. "కట్టుకున్న పెళ్ళాన్ని అదలించినట్లు ఏమిటి అదలింపు...?" అని అడగాలనిపించింది. చచ్చే వేకరి చేస్తేనేగా ఆ కూలి ముఖాన పడేసేది. ఇంతప్పటి నుంచి మావ చాకిరి చేస్తే ఇస్వాసం లేకుండా వదిలేసాడు నీ అయ్య...! ఎందుకు తేవాలి నీళ్ళు...?" అని నాలుగు కడిగేయాలనిపించింది. నలుగురు తిరిగే చోట రాద్ధాంతం ఎందుకని ఊరుకొని, కడవతో నీళ్ళుపట్టుకళ్ళి ముంచరుంచి పక్కకు ఒదిగి నిలబడింది.

ముఖం తుడుచుకొంటూ "ఏటో అలో చిత్తున్నావ్...! నాగులుకు ఎలా ఉందేటి...?" మాటల్లోకి దించటానికి ప్రయత్నించాడు.

"ఎలా ఉంటది...?" అని ముక్తసరిగా అనేసి, కుండ పట్టుకొని రెండడుగులు వేసింది.

"ఎలాగైనా దీన్ని పట్టాలనే... నిశ్చయంతో ఉండగా మెరుపులాంటి ఆలోచన తట్టింది. "అయ్యో, అమ్మా...! ఊళ్ళో లేరు... ఇంతకన్నా సమయం దొరకదు...! పిట్ట పడిపోతుం"దనుకొంటూ

"ఇదో మల్లి... ధాన్యం ఆరబోసి బాగు చేయాలి...! కూలిచ్చేత్తా... తొందరగా వచ్చెయ్...!" అంటూ తిరుగు సమాధానానికి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఆ మాటతో మరింత రెచ్చిపోయింది.

## అరుదైన అణిముత్యాలు

తమాయించుకొని "నీ ఇంటికొచ్చి పని చేయటం కన్నా నాలుగిళ్ళు అడుక్కోవటం మంచిది..!తూ... ! నే చచ్చినా రాను...!" గొణుక్కుంటూ కడవ ముంచి చంకనెత్తుకొని ఇల్లు చేరింది... ఆమెను చూస్తేనే చచ్చిపడతారే, ఆమె నడకను చూస్తే దారమ్మట పోయే వాడు రాతి బొమ్మలా నిలబడిపోతాడు... డాక్టరు బాబు వచ్చి నాగులకు ఇంజక్షన్ ఇచ్చి కూర్చోబోతుండగా మల్లి చూచి "దండాలు బాబూ...!" అంటూ పక్కగా నిలడింది.

"ఆ... ఆ! మల్లి ఇంకా పనిలోకి వెళ్ళలేదా...?" అంటూ ఆప్యాయంగా పలకరించాడు.

"ఎల్లేదు బాబు...! ఇప్పుడే చెరువు నుండి వచ్చా... ఎల్తా...!" అని ఒకమారు పెద్దగా నిట్టూర్చింది.

"ఎన్ని జన్మలెత్తినా నీ ఋణం తర్చుకోలేం బాబు... ఆడూ ఉన్నాడు.. ముదరనష్టపోడు .. నా మావ చవూ నెత్తురూ ధారపోసాడా.. ఎలాగున్నాడని కూడా అడగడు... ఇప్పుడు నేనెల్లి ధాన్యం ఆరబోయాలట... నేనెల్లకెం.. ఆ మాయదారోడు సినయ్య నన్ను చూచి కంట్లో కారం కొట్టుకుంటాడు..."

అమె తిట్లు వినలేకపోయాడు నాగులు. లేవాలనే ఆత్రం కొద్దీ లేవబోయి వీలు కాక పరుండి "మల్లి... తిట్టకు.. భూపయ్యబాబు రమ్మంటె ఎల్లక తప్పదే... మన మీద అభిమానముండబట్టే పిలిచాడు... మంచాన పడ్డాక కూడా ఎంత కాలం చూస్తాడు...? అది మన దురదృష్టం... ఎల్లు... ఎల్లకపోతే నన్ను చంపుకు తిన్నట్టే... ఆ..." అన్నప్పుడు అతనిలో బహిర్గతమయ్యే అమాయకత్వం, నిస్వార్థం చెప్పనలవి కాదు. మంచి వాని లక్షణం తన దురదృష్టమనే ఎంచుకొంటాడుగాని, పరులను ఎంచటానికి ఒప్పుకోడు.

"ఇది వరస డాక్టర్‌బాబు... మంచిగా ఉంటె ఎవరూ చెప్పుక్కర్లేదు, నేనే ఎల్తా... కాని, ఆ సినయ్య చూపుల్లో ఇసం ఉంటే ఎలా ఎల్లగలను చెప్పు బాబు...?"

అళ్ళ... ఇసం... అళ్ళనే పాడు చేస్తుందే... మనం మంచిగా ఉంటే వాళ్ళ ఇసం మన్నేంచేయలేదు.. మీరే చెప్పండి డాక్టర్‌బాబూ...!" అంటూ ఇద్దరూ నిలదీసేసరికి కూర్చొన్నవాడల్లా లేచి నిలబడి-

"నాగులూ... వీళ్ళలో మంచిని చూచావు నువ్వు... కాని చెడును చూడలేదుగా...? మల్లిచెప్పింది కాదనటానికి వీల్లేదు... ఆమె సందేహాన్ని కాదనే ధైర్యం నాకు లేదు... ఇద్దరి భావాలు వేరు వేరు బాటలలో పయనించేటప్పుడు ఎవ్వరం చెప్పలేం...! ఏం జరుగుతుందో అనేది ఊహకందని విషయం... వస్తా..." అంటూ వెళ్ళిపోయాడు.

ఇంటి పనులన్ని చక్కబెట్టుకొనేసరికి బారెడు ప్రొద్దెక్కింది. "మల్లక్కా...!" అన్న పిలుపు వినగానే, బయటకొచ్చింది. వచ్చింది పొరుగింటి సీత. తెచ్చిన రొట్టి మల్లి చేతిలో పెడుతూ "అక్కా ఇది బావకెట్టమంది అమ్మ...!" అని చెప్పగానే "నేను తిననులేవే...! బావకే పెడతా...!" అన్నది మల్లి.


సీత రెండడగులు వేసి ఆగి "అక్కా... మరచా... మిల్లులో పనుందట... ఎక్కడా పనొప్పుకోద్దంది..." చెప్పి వెళ్ళిపోయింది.

బయట మాటలు నాగులు చెవిలో పడ్డాయి. "మల్లి రానని చెప్పలేదేమో"" అన్న భావం మనసులో మెదలగానే ఎంతో బాధపడ్డాడు. అవిటివాడేం చేయగలడు...?

లోపలకు వచ్చిన మల్లి తిన్నగా నాగులు మంచం మీదకు వెళ్ళి కూర్చొని "చానికమ్మ రొట్టిచ్చింది మావా... తిను.." అంటూ విరచి ముక్క నోటి కందివ్వబోయింది.

"వద్దన్న"ట్లుగా మూతి తిప్పేసాడు. విషయం పసిగట్టేసింది.

"కోపం వచ్చిందా..?" అంటూ అనునయంగా మీదకు వంగింది.



"నాకెందుకే కోపం?" అన్నాడేగాని ముఖం తేటగా లేదు.

"మావా! నేను ఎన్నో ఇదాలుగా చూచే అన్నాను!నీకు లేని బాధ నాకెందుకూ? ఎల్తా! కాని, ఆ మాయదారోడు ఏదైనా చేస్తే తగిన బుద్ధి చెబుతా!" అంటూ తన నిర్ణయాన్ని తెలియజెప్పింది

వెడతానన్నందుకు ఎంతో తృప్తిపడ్డాడు "స్వర్నే నీ ఇష్టమొచ్చినట్లే చేయి . నీ బమే గాని, అలాంటిదేం జరగదు !" అంటూ నోటి కందించబోయిన రొట్టి ముక్కను అందుకొన్నాడు. పూర్తిగా తిన్న తర్వాత అక్కడ నుండి లేచి, చిర సవరించుకొని "నె యెల్లిరానా ?" అనగానే నాగలు చిరు నవ్వుతో ఆమెను సాగనంపాడు.

* * *

అదరిళ్ళల్లో పనులయ్యేసరికి పది గంటలు కావస్తుంది చేయవలసిన పనేం లేదు టిఫిన్ కాఫీ పూర్తయ్యేసరికి మరో అర్ధ గంటయ్యింది ఇంకక్కడ నుంచి ఆలోచనలో పడింది

"భూషయ్య ఇంటికి వెళ్లాలా? వద్దా?" అన్న తర్కం లో పదకొండైంది. మనసు ఒప్పుకోవటం లేదు వెళ్లకపోతే మావ తిండి ముట్టడు. ఒక మారు భారంగా తల పంకించి లేచింది.

కీచకుడు, కిరాతకుడని తెలిసి ద్రౌపది వెళ్ళిందంటే ఆమె ఆత్మబలం, దైవబలం ఉండబట్టే వెళ్లి శీలాన్ని కాపాడుకొని రాగలిగింది ఏం జరిగితే అది జరుగుతుందనే నిర్ణయానికొచ్చి "సావిత్రమ్మగోరూ ఇప్పుడే వస్తా " అంటూ తలుపు ఓరగా వేసి భూషయ్య ఇంటి ముఖం పట్టింది. ఆమె హృదయం ఒప్పుకోకపోతున్నా, తప్పనిసరై హాల్లో అడుగు పెట్టింది

లోపల అలికిడి లేదు. పది నిముషాలు చూచి తిరుగు ముఖం పట్టబోతుంటె సీనయ్య వచ్చి "మల్లీ. ఎల్లిపోతున్నావేం? రా " అనగానే వెనుకకు తిరిగింధి సీను కుర్చీలో కూర్చుంటూ "కొట్టు తాళాలు గదిలో మేకునున్నాయి తీసుకొని వద్దు అరబోయి " అన్నాడు తాళాలు గదిలో ఉన్నాయనేసరికి తటపటాయించి ధైర్యం తెచ్చుకొని

# అరుదైన ఆణిముత్యాలు

గదిలోకి అడుగుబెట్టి మేకునున్న తాళాలు తియిబోతుండగా సీను వెనుకనే వచ్చి ఆమెను సందిటలో బంధించాడు "అమ్మో అయ్యో .!" అంటూ చాలా సేపు పెనుగులాడింది

ఆమె కూడా బింకంతో ఉందేమో, సీను లొంగతీయలేకపోయాడు పట్టు తప్పింది అంతే, పట్టు నుంచి బయట పడి పడగానే, వారగా ఉన్న చేతి కఱ్ఱను అందుకొని గొడ్డును బాదినట్లు బాదింది

"చావు చచ్చినోడా! నీ తల్లి, చెల్లెలులాంటిదాన్ని కానా? తప్పులేదనుకొంటే అళ్లతో కులకరా" అంటూ వీధిలో పడి కేకలు మొదలుపెట్టింది.

ఆమె కేకలకు పది మంది ఆడవాళ్ళు చేరి విషయం గ్రహించగానే, సినయ్యను బయటకు లాక్కొచ్చితలో నాలుగూ బాదారు గొడ్డయితే ఫర్వాలేదు చెప్పినట్లు వింటుంది మనిషిగా. .!

మల్లి క్షణం అక్కడ ఉండలేపోయింది. తిన్నగా గుడిసెకు చేరి నాగులు కాళ్ల వద్ద పడి ఏడ్చింది. నాగులుకి అప్పటికిగాని వాళ్ళ నిజ రూపం అర్థం కాలేదు.

"ఏడవకే ! మంచిని అర్థం చేసుకోలేని మనుషుల మధ్య బ్రతకలేవని నే చెప్పా... అందుకేనే, నా నిర్ణయం ఎప్పుడో చెప్పా నీకు . నీకది ఇష్టం లేదు"

"నాకలాంటి నిర్ణయం చెప్పొద్దు మావా... పుట్టింది నీచ కులమైనా, శీలాన్ని నీచపరచుకో లేను. వినలేను వినను ." అంటూ దూరంగా జరిగింది.

* * *

డాక్టరు తడికె తోసుకుని లోపలకు రాగానే "ఏం నాగులూ . ఎలాగుంది. ?" అంటూ దగ్గర కొచ్చాడు

అప్పటికే నోట మాట లేదు నిలువు గుడ్లు పడుతున్నాయి

"ఏంరా పలకవూ .?" అంటూ నాడి చూచి "ఓ గాడ్.. !" అంటూ పెట్టె తెరచి కలయజూచాడు. కాని, కావలసినది మాత్రం దొరకలేదు. పరుగున బయటకొచ్చి సైకిల్ ఎక్కి దౌడు తీసాడు. పరుల బాధ తనదిగా భావించే వాడి లక్షణం అది. దారిల్లో మల్లి కనిపించగానే "మల్లి తొందరగా ఇల్లు చేరు ." చెబుతూనే సైకిలు స్పీడు పెంచాడు,

మల్లికి కొంతలో కొంత అర్థమై పరుగు పరుగున గుడిశ చేరింది.

చిన్న గ్రామమేమో, అక్కడ మందుల షాపులో ఒకటుంటే ఒకటి ఉండదు అనుకొన్నది దొరకక దానితో సమానమైన మరొక ఇంజెక్షన్ తీసుకొని సైకిలెక్కి రొప్పుతూ గుడిశకు చేరాడు. సైకిల్ స్టాండు వేసాడో? లేదో? పరుగున లోపలకు చేరగానే తన కళ్లను తాను నమ్మలేకపోయాడు. జల జలా కన్నీళ్లు కారుతుంటె ఆ ఆదర్శ దంపతులిద్దరికీ అంతిమ వీడ్కోలు చెప్పాడు. పెదవులు వణుకుతూండగా,

"ఈ సృష్టిలో వీళ్లు అరుదైన ఆణిముత్యాలు...! భార్యా భర్తల అనురాగానికి నిర్వచనాన్నిచ్చిన మణిపూసలు. భవిష్యత్తులో అరుదైపోతాయి. నాగులూ .. నీ తర్వాత మల్లిని ఒప్పించి మరొక పెళ్లి చేయించమని చెప్పావుగాని, నీతో తాళి కట్టించుకొన్న పుణ్యానికి తన శీలాన్ని మరొకరికి ఫణం పెట్టనంటూ నీకు తోడుగా ప్రయాణం కట్టిన ధన్య జీవి ఆ మల్లిరా.. స్త్రీ లోకానికి నీతి సందేశమిచ్చిన మల్లి కులం కాదు గుణం ముఖ్యమందిరా. .! వయసు చిన్నదే ఆదర్శం గొప్పది.." అంటూ వాళ్ల గురించి కడపటి పలుకులు పెదవుల మధ్య నుండి దొర్లాయి. కన్నీళ్లు కార్చటానికి ఆత్మబంధువే అక్కరలేదు, అంతకు మించిన మనసున్న మనిషిగా, చదివింది ఎం.బి.బి.ఎస్ అయినా, తన వృత్తి ధర్మాన్ని పేదల సేవకే అంకితం చేయాలనే ధ్యేయంలో ఆ అరుదైన ఆణిముత్యాలలో తానొక ఆణిముత్యమై నిలచిపోయాడు రఘురాం .

